

గురువారం ప్రజాభవన్ వద్ద ధర్నా చేసేందుకు వచ్చిన రైతులను అరెస్టు చేస్తున్న పోలీసులు


సూర్యాపేటలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్‌ను గృహ నిర్బంధం చేసిన పోలీసులు


రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నేతలను అరెస్ట్ చేసి ఠాణాకు తీసుకెళ్తున్న పోలీసులు

## లోకం పోకడ





నల్లగొండ జిల్లా చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న రైతులు


అరెస్టు చేసిన బీఆర్‌ఎస్ నేతలను నారాయణపేట జిల్లా కోస్గి పీఎస్‌కు తీసుకొచ్చిన పోలీసులు


కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో రూ.2 లక్షల రుణమాఫీ చేసేలా చూడాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు గురువారం రెండో రోజూ అన్నదాతలు ఉత్తరాలు రాశారు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రంతోపాటు మైలారం, ఆవుడం పోస్టాఫీసుల్లో దాదాపు 100 మంది రైతులు గవర్నర్‌కు ఉత్తరాలు పోస్టు చేశారు. కొందరు రైతులు రిజిస్టర్ పోస్టు చేయగా.. మరికొందరు సాధారణ పోస్టు చేశారు.

# ఠాణాల్లో రైతు 'బందీ'

▶ మొదటిపేజీ తరువాయి...

విడిచిపెట్టాలని బీఆర్‌ఎస్ డిమాండ్ చేసింది. రుణమాఫీ అమలు కాని రైతులు చలో ప్రజాభవన్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు బుధవారం అర్ధరాత్రి నుంచే రైతులను, వారికి సంఘీభావం ప్రకటించిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం ప్రారంభించారు. కొన్నిచోట్ల పొలం పనుల్లో ఉన్న రైతులను సైతం పోలీసులు నిర్బంధించారు. రైతుల అక్రమ అరెస్టులతో రాష్ట్రం అట్టుడికింది.

### ఎక్కడికక్కడ అరెస్టులు

రాష్ట్రవ్యాప్తంగా అన్ని బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో పోలీసు నిఘా పెట్టారు. రైతు అని అనుమానం వచ్చిన ప్రతీ ఒక్కరిని అదుపులోకి తీసుకొని సమీప పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఇండ్ల ముందు అర్ధరాత్రి నుంచే గస్తీ తిరిగారు. ఏ కారణం చేత బయటికి వచ్చినా పట్టుకెళ్లి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. హైదరాబాద్ ప్రధాన రహదారులపై నిఘా పెట్టారు. ఇక ప్రజాభవన్ పోలీస్ క్యాంపును తలపించింది. వందలమంది పోలీసులతో ప్రజాభవన్ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

### దొంగలమా? టెర్రరిస్టులమా?

శాంతియుతంగా నిరసన చేస్తామని తెలిపినా ప్రభుత్వం తమపై కర్కశంగా వ్యవహరించిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి నుంచి ఉదయం వరకు ఎక్కడికక్కడ అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లలో పెడతారా? అని ప్రశ్నించారు. తామేమైనా దొంగలమా? టెర్రరిస్టులమా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి షరతుల్లేకుండా ఇచ్చిన మాట ప్రకారం రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తే తాము ప్రజాభవన్‌కు వచ్చేవాళ్లం కాదనే విషయాన్ని ప్రభుత్వం గుర్తిస్తే మంచిదని పేర్కొన్నారు.

### రుణమాఫీపై పోరాటం ఆగదు

రుణమాఫీపై పోరాటం ఆగదని రైతాంగం స్పష్టం చేసింది. షరతులు లేకుండా రూ. 2 లక్షల రుణమాఫీ చేసేవరకు పోరాటం చేస్తామని రైతులు తేల్చి చెప్పారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని అణచివేయలేరని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో అక్రమ అరెస్టులా? అని ప్రశ్నించారు.

### జెండా మోసినందుకు ఇదా ప్రతిఫలం?

భుజం కాయలు కాసేలా కాంగ్రెస్ జెండా మోసిన తమకు సీఎం రేవంత్‌రెడ్డి మంచి గుణపాఠం చెప్పారని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. తమను అవమానాలకు గురిచేసిన కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా అరెస్టులా అని మండిపడ్డారు. ప్రజాభవన్ అని పేరుపెట్టుకోవటం ఎందుకని? ప్రజల్లో తాము లేమా? అని నిలదీశారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రూ. 2 లక్షల రుణమాఫీ అయ్యేవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. రుణమాఫీ విషయంలో రేవంత్‌రెడ్డి సర్కార్ తమను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇప్పటివరకు రుణమాఫీ' అనే వాట్సాప్ గ్రూపులో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రభుత్వ తీరుపై దుమ్మెత్తి పోశారు.

## రైతు ముందు సర్కారు తలవంచక తప్పదు: కేటీఆర్



**రుణమాఫీపై** ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని 'చలో ప్రజాభవన్'కు పిలుపునిచ్చిన రైతులను అరెస్ట్ చేస్తారా? అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా అరెస్ట్ చేసిన రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి నుంచి రైతులను, రైతు సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్లలో నిర్బంధించడం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులేమైనా దొంగలా? ఉగ్రవాదులా? అని నిప్పులు చెరిగారు. అప్రజాస్వామిక చర్యలను ప్రభుత్వం వెంటనే ఆపాలని కోరారు. పోలీసుల నిర్బంధకాండతో రైతుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులంటే సీఎంకు భయం ఎందుకని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే ఏకకాలంలో రూ. 2 లక్షలు రుణమాఫీ చేస్తామని హామీనిచ్చి మోసం చేసినందుకే రైతులు ఆందోళన బాట పట్టారని గుర్తుచేశారు. ఏ రాజకీయపార్టీతో సంబంధం లేకుండా తమకు తామే సంఘటితమై మొదలుపెట్టిన ఈ రైతు ఉద్యమం ఇంతటితో ఆగదని, రైతుల సంఘటిత శక్తి ముందు దగాకోరు కాంగ్రెస్ ప్రభుత్వం తలవంచక తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.

### మాఫీ చేయమంటే అరెస్టులా? : నిరంజన్‌రెడ్డి

రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని అడిగిన రైతులను అరెస్టులు చేస్తారా? అని మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో ఇంతవరకు రూ. 2 లక్షల రుణమాఫీ జరగలేదని పేర్కొన్నారు. అరచేతిలో వైకుంఠం చూపి అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసిందని ధ్వజమెత్తారు. తమకు రెండు లక్షల రుణమాఫీ కావాలనే ఆత్రుతతో అంతకు మించి ఉన్న అప్పును వడ్డీలకు తెచ్చి కట్టారని, ఆ రైతులకు కూడా రుణమాఫీ చేయకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### రైతుల అరెస్టు అప్రజాస్వామికం : కొప్పుల

ఇచ్చిన మాట ప్రకారం రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తే రైతులు రోడ్డు ఎందుకు ఎక్కుతారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. రైతుల అరెస్టు అప్రజాస్వామికమని పేర్కొనారు. నమ్మించి మోసం చేయడమే ఇందిరమ్మ రాజ్యం ధ్యేయంగా మారిందని దుయ్యబట్టారు. పోలీసు యాక్ట్ పేరుతో గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే సహించేది లేదని కొప్పుల హెచ్చరించారు.

## ఆంక్షల్లేవు.. కంచెల్లేవా?: హరీశ్‌రావు



**రైతులంటే** సీఎం రేవంత్‌రెడ్డికి వణుకు ఎందుకని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. రైతుల అరెస్టులను ఆయన తీవ్రంగా ఖండించారు. రుణమాఫీ కాలేదన్న ఆవేదనతో రైతులందరూ సంఘటితమై 'చలో ప్రజాభవన్'కు పిలుపునిస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి వణుకుపుట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు, రైతు సంఘాల నాయకులను నిర్బంధిస్తూ వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష తీర్చుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ కోసం పోరుబాట పట్టిన రైతన్నల అరెస్టులు దుర్మార్గమని మండిపడ్డారు. 'మాది ఆంక్షలు లేని ప్రభుత్వం, కంచెలులేని ప్రభుత్వం, ప్రజా పాలన అంటూ డబ్బా కొట్టుకునే రేవంత్‌రెడ్డి ఇదేంది? ప్రజాభవన్ చుట్టూ ఎందుకు ఇన్ని బారికేడ్లు, ఎందుకు ఇన్ని ఆంక్షలు? ప్రజాభవన్‌కు రైతులు తరలివస్తున్నారంటే సీఎంకు ఎందుకు అంత భయం?' అని నిప్పులు చెరిగారు. రుణమాఫీపై రేవంత్‌రెడ్డి మాట తప్పారని మండిపడ్డారు. మాట తప్పడమే ప్రభుత్వానికి ఉరితాడు కాబోతున్నదని హెచ్చరించారు. రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా మొదలైన రైతుల ఉద్యమాన్ని ఎదుర్కోవడం అంటే రాజకీయంగా వెకిలి మకిలి, చిల్లర వ్యాఖ్యలు చేసినంత సులువు కాదని విమర్శించారు. నర్సంపేటలో మెడికల్ కాలేజీ, జనరల్ దవాఖానను మంత్రులు ప్రారంభిస్తున్నారన్న కారణంతో పెద్ది సుదర్శన్‌రెడ్డి సహా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను హౌస్ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు గురువారం ఎక్స్ వేదికగా తెలిపారు. తెలంగాణ రాష్ట్రం గత పదేండ్లలో సాధించిన పురోగతిని తెలుపుతూ ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి తాజా నివేదికలో స్పష్టంగా చెప్పిందని హరీశ్‌రావు తెలిపారు. ఇది దాచేస్తే దాగని సత్యమని, దివాలా అని దివాలాకోరు మాటలు మాట్లాడినంత మాత్రాన అబద్ధం నిజం కాదని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 39.7°c | 22.7°c |
| మెదక్ | 36.8°c | 20.5°c |
| రంగారెడ్డి | 36.5°c | 18.8°c |
| ఖమ్మం | 35.0°c | 24.0°c |
| నిజామాబాద్ | 34.0°c | 23.5°c |
| వరంగల్ | 34.0°c | 25.0°c |
| హైదరాబాద్ | 33.6°c | 22.9°c |
| నల్లగొండ | 33.0°c | 25.0°c |
| మహబూబ్‌నగర్ | 32.1°c | 21.2°c |
| కరీంనగర్ | 32.0°c | 26.0°c |

## ప్రజాభవన్ ముందు.. పోలీసుల కంచె

**రైతులను అరెస్ట్ చేసి వ్యానులో తరలింపు**

హైదరాబాద్, సెప్టెంబర్ 19(నమస్తే తెలంగాణ): రుణమాఫీ కాని రైతులు గురువారం 'చలో ప్రజాభవన్'కు పిలుపునివ్వడంతో రాష్ట్రం నలుమూలల నుంచి రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వీరిని అడ్డుకునేందుకు ప్రభుత్వం ప్రజాభవన్ ముందు పోలీసులను పెద్ద ఎత్తున మోహరించింది. పెద్దపెద్ద బారికేడ్స్, ముళ్లకంచెలు ఏర్పాటు చేసింది. సీఆర్‌పీఎఫ్ బలగాలతో రైతులను ఎక్కడికక్కడ అడ్డుకున్నది. కనిపించిన వారిని కనిపించినట్టు అరెస్ట్ చేసి వ్యాన్ ఎక్కించి అక్కడి నుంచి తరలించారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. ఉదయమే ప్రజాభవన్‌కు చేరుకున్న రైతులు సాయంత్రం వరకు ముట్టడికి ప్రయత్నించారు. అప్పుడు ఇనుప కంచెల్ని బద్దలు కొట్టానని ప్రకటించావు కదా.. ఇప్పుడు మళ్లీ ఇనుప కంచెలు ఎలా వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డిని రైతులు ప్రశ్నించారు. తమపై నిరంకుశంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు.

## రేవంత్‌పై చర్యలు తీసుకోండి

సీఎం వ్యాఖ్యలు రాజ్యాంగ విలువలకు విరుద్ధం

మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీకి మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): మాజీ సీఎం కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉపయోగిస్తున్న అసభ్యకరమైన భాష, నేరపూరిత వ్యాఖ్యలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేశారు. సీఎం వ్యాఖ్యలు రాజ్యాంగ విలువలకు విరుద్ధమని, మహాభారతంలో దుర్యోధనుడి క్రూరత్వంలా రేవంత్‌రెడ్డి ప్రవర్తన ఉన్నదని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి హరీశ్‌రావు గురువారం బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీ తానే ప్రవచించిన ప్రమాణాలను పాటించకపోవడం ఆ పార్టీ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌పై దూషణలు, కించపరిచే వ్యాఖ్యలు చేయడం రేవంత్‌రెడ్డి దిగజారుడు తనానికి నిదర్శనమని మండిపడ్డారు. కేసీఆర్, ఆయన కుటుంబంపై రేవంత్‌రెడ్డి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం సీఎం స్థాయిని దిగజార్చడం కాదా? కేసీఆర్‌ను రాళ్లతో కొట్టి చంపాలంటున్న రేవంత్ వ్యాఖ్యలను కాంగ్రెస్ హైకమాండ్ సమర్థిస్తుందా? అని ప్రశ్నించారు. రేవంత్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.హింసాత్మక వ్యాఖ్యలు, జర్నలిస్టులపై దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని చెప్తున్న రాహుల్‌గాంధీ ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు.

## జింబాబ్వే దుస్థితి మనకు రావొద్దు



**'గ్రీన్ ఇండియా చాలెంజ్'లో భాగంగా మొక్కలు నాటుదాం**

**ఎక్స్‌లో రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్**

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : జింబాబ్వేలో ప్రస్తుతం కరువు తాండవిస్తున్నదని, అందుకు ప్రధాన కారణం చెట్లను నాటి, సంరక్షించకపోవడమేనని రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్ తెలిపారు. చెట్లు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలను, జింబాబ్వే దుస్థితిని గుర్తు చేస్తూ ఆయన గురువారం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'జింబాబ్వేలో అడవులను నిర్మూలించడం తీవ్రమైన వాతావరణ సంక్షోభం, పర్యావరణ క్షీణతకు కారణమైంది. అందుకే నేను కూడా మన గురించి ఆందోళన చెందుతున్న. అలాంటి దుస్థితి మనకు రాకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ నా 'గ్రీన్ ఇండియా చాలెంజ్'లో చేరి, మొక్కలు నాటాలని విజ్ఞప్తి చేస్తున్న. మనమంతా కలిసి మన దేశ సుస్థిర భవిష్యత్‌ను సృష్టిద్దాం' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. జింబాబ్వేలో ప్రస్తుత తాండవిస్తున్న కరువుపై డెక్కన్ హెరాల్డ్ రాసిన కథనాన్ని ఈ పోస్టుకు ఆయన జత చేశారు.

# సర్కార్‌కు రైతుల ఉసురు తగులుతది

- వెంటనే రైతుబంధు, రుణమాఫీ నిధులివ్వాలి
- దేశంలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉంటే కాంగ్రెస్ నేతల ఏడుపుగొట్టు మాటలు
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మండిపాటు



హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : రైతుబంధు, రుణమాఫీ నిధులు వెంటనే విడుదల చేయాలని, లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగులుతుందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫైర్ అయ్యారు. దేశంలోనే తెలంగాణ అన్నిరంగాల్లో ముందున్నదని ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి నివేదిక స్పష్టం చేస్తే కాంగ్రెస్ నేతలు రోజూ ఏడుపుగొట్టు మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవాచేశారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య, బీఆర్‌ఎస్ లీగల్ సెల్ నాయకుడు కల్యాణ్‌రావుతో కలిసి తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తెలివి తక్కువవారిగా చూస్తున్నదని, పార్టీలకు అతీతంగా రుణమాఫీ కాని రైతులు చలో ప్రజాభవన్‌కు పిలుపునిస్తే వారితో పాటు బీఆర్‌ఎస్, బీజేపీ, కమ్యూనిస్టు కార్యకర్తలను కూడా పోలీసులు అరెస్ట్ చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో నిర్బంధ పాలన కొనసాగుతున్నదని విమర్శించారు. ఎలాంటి షరతులు లేకుండా రైతు బంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు కూడా ఇస్తామన్న డబ్బులు ఏవని ప్రశ్నించారు. రైతుబంధు కోసం 70లక్షల మంది రైతులు ఎదురుచూస్తున్నారని చెప్పారు. రైతు బంధు నిధులపై శుక్రవారం నాటి క్యాబినెట్‌లో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ అడిగిన రైతులను పోలీసులు అరెస్ట్ చేస్తున్నారని, వారిని వెంటనే విడుదల చేయాలని, రైతు బీమా, ఫసల్ బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### కేసీఆర్ విధానాలతోనే తెలంగాణ నంబర్ వన్

ఆర్థిక అంశాల్లో అన్ని రాష్ట్రాలను తలదన్నేలా తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉన్నదని పల్లా తెలిపారు. ఐటీ, వ్యవసాయం, పరిశ్రమలు ఇలా అన్ని రంగాల్లో ముందున్నదని, గత సీఎం కేసీఆర్ అనుసరించిన విధానాలతోనే ఇది సాధ్యమైందని స్పష్టంచేశారు. రాష్ట్రం అప్పుల పాలైందంటూ, దివాలా తీసిందంటూ సీఎం, మంత్రులు ఏడుపుగొట్టు మాటలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. ఇకనైనా అలాంటి చేతగాని మాటలను ఆపాలని సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పది నెలల పాలనలో ఒక్క పాలసీగాని, కొత్త పథకం గాని అమలు చేయలేదని, అయినా రూ.75 వేల కోట్ల అప్పు చేశారని విమర్శించారు. 2014-15లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.1.24 లక్షలు ఉన్నదని, 2023-24 నాటికి రూ.3.47 లక్షలకు చేరిందని చెప్పారు. దేశ తలసరి ఆదాయం కేవలం రూ.1.83 లక్షలేనని గుర్తుచేశారు. వృద్ధి రేటులో దేశం కంటే తెలంగాణ 193 శాతం ముందున్నదని తెలిపారు. జీడీపీలో తెలంగాణ వాటా 3.8 శాతం ఉండగా 2023-24 నాటికి 4.9 శాతానికి చేరిందని, 2014-15లో తెలంగాణ జీఎస్‌డీపీ రూ.5.05లక్షల కోట్లు ఉండగా 2023-24 నాటికి రూ.14.62 లక్షల కోట్లకు చేరిందని వివరించారు. ఐటీలో ఉద్యోగుల సంఖ్య, ఎగుమతులు భారీగా పెరిగాయని, వీటికి ప్రధాన కారణం కేసీఆరే అని స్పష్టం చేశారు.


ఆర్మూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతు జేఏసీ నేతలు

## రుణమాఫీ చేయాలని రైతుల ధర్నా

తహసీల్దార్ ఆఫీసుల ఎదుట అన్నదాతల నిరసన

నందిపేట్, సెప్టెంబర్ 19: కాంగ్రెస్ పార్టీ చెప్పినట్టు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని రైతులు గురువారం నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ డివిజన్ వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. రూ.2 లక్షల రుణమాఫీ, రైతుభరోసా, వరికి రూ.500 బోనస్ అమలు చేయకపోతే రైతుల సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. అనంతరం రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

# రైతు, కౌలురైతులే తేల్చుకోవాలి

- రైతుభరోసా ఎవరికి ఇవ్వాలో వాళ్లే నిర్ణయించుకోవాలి
- కుండబద్దలు కొట్టిన మంత్రి తుమ్మల
- ఇద్దరికీ రైతుభరోసా ఇస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

'రైతులకు, కౌలురైతులకు ఎకరానికి రూ.15 వేల చొప్పున రైతుభరోసా ఇస్తాం'

**- ఇదీ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీ.**

'రైతులకు, కౌలు రైతులకు ఎవరికి ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం వాళ్లకు ఇస్తాం'

**- ఇదీ ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షుడిగా ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ.**

'రైతుభరోసా పెట్టుబడి సాయం ఎవరో ఒకరికే ఇస్తాం. దీనిపై రైతులు, కౌలు రైతులు మాట్లాడుకోవాలి'

**-ఇదీ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తాజా ప్రకటన.**



హైదరాబాద్, సెప్టెంబర్ 19(నమస్తే తెలంగాణ): రైతులకు, కౌలురైతులకు ఇద్దరికీ రైతుభరోసా ఇస్తామంటూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ఒట్టిదేనని తేలిపోయింది. ఇద్దరికీ ఇవ్వడం కుదరదని, ఎవరో ఒకరికి మాత్రమే రైతుభరోసా ఇస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుండబద్దలు కొట్టారు. గురువారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. రైతుభరోసాపై కీలక వ్యాఖ్యలు చేశారు. కౌలు రైతులకు రైతుభరోసా ఇస్తారా? అని మీడియా అడిగిన ప్రశ్నకు మంత్రి తుమ్మల స్పందిస్తూ.. 'అది రైతులు, కౌలు రైతులు మాట్లాడుకోవాలి అని స్పష్టంచేశారు.

### సీఎంది ఒకమాట.. మంత్రిది మరోమాట

విధానపరమైన నిర్ణయాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రులకు సఖ్యత కుదరడం లేదనే అంశం ఇప్పటికే ప్రచారంలో ఉన్నది. రైతుభరోసాపై మంత్రి తుమ్మల వ్యాఖ్యలతో ఇది మరోసారి నిరూపితమైంది. కౌలు రైతులకు రైతుభరోసాపై సీఎం రేవంత్‌రెడ్డి ఒక విధంగా చెబితే.. ఆ శాఖ మంత్రి తుమ్మల అందుకు భిన్నంగా చెప్పడం గమనార్హం.

### కేసీఆర్ చెప్పిందే నిజమైంది

కౌలు రైతులకు రైతుబంధు అంశంపై 2019లో ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ చెప్పిందే ఇప్పుడు నిజమైంది. 2019లో రైతుబంధు పెట్టుబడి సాయాన్ని రూ.4 వేల నుంచి రూ.5 వేలకు పెంచే సందర్భంలో కౌలురైతులకు పెట్టుబడి సాయంపై కేసీఆర్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. 'నేను బాధ్యత గల ముఖ్యమంత్రిగా చెప్తున్నా.. రైతులకు మేము సాయం చేస్తున్నాం కాబట్టి.. మీరు (రైతులు) మానవీయ కోణంలో ఆలోచించి కౌలురైతులకు సాయం చేయాలి. ఇది రైతులు, కౌలు రైతుల మధ్య జరగాల్సిన విషయం. ఆ ఇద్దరి మధ్య సమస్యతో ప్రభుత్వానికి సంబంధం లేదు' అని నిక్కచ్చిగా చెప్పారు.

### 200% పంట వేసిన వారికే రైతుభరోసా

రైతుభరోసా పంట సాగు చేసిన రైతులకు మాత్రమే అందిస్తామని మంత్రి తుమ్మల తేల్చి చెప్పారు. '99% కాదు... 200% చెప్తున్నా.. పంట వేసిన రైతులకు మాత్రమే రైతుభరోసా ఇవ్వాలని కోరుకుంటున్నారు. ప్రభుత్వం కూడా అదే అమలు చేయబోతున్నది' అని స్పష్టంచేశారు. దీంతో రైతుభరోసాలో కోతలు తప్పవని తేలిపోయింది.